క్లుప్తంగా

రాష్ట్ర పోటీల్లో కర్నూలుకు బంగారు పతకాలు



దేవశృతిసాయి



సామియా టాంజీన్

కర్నూలు (టౌన్): విజయవాడలోని ఈడుపుగల్లు పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్లు బంగారు పతకాలు సాధించారు. నగరంలోని మాంటిస్సోరి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దేవ శృతి సాయి అండర్-17 విభాగంలో 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 800 మీటర్ల ఫ్రీస్టైయిల్ పోటీల్లో బంగారు పతకాలు గెలుపొందింది. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సామియా టాంజీన్ అండర్-17 విభాగంలో 200 మీటర్ల బటర్ ఫ్లై పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఇరువురు స్విమ్మర్లు పతకాలు తెచ్చుకోవడంపై స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు హర్షం వ్యక్తం చేశారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు సిటీ: కర్నూల్ నగరంలోని సున్నముగేరికి చెందిన షేక్ మోషిన్ అనే వ్యక్తిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో పోపోక్సో చట్టం కింద కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ మోషిన్ ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లోని మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం సదరు మహిళ తన అత్త దృష్టికి తీసుకుపోవడంతో షేక్ మోషిన్‌ను నిలదీశారు. దీంతో వారి మధ్య వాగ్వాదం పెరిగి పోయింది. మోషిన్ ఇంట్లోని మహిళలు వారిపై దాడి చేశారు. బాధిత మహిళల కేకలు విని స్థానికులు కొందరు అక్కడికి వచ్చేసరికి షేక్ మోషిన్‌తో అతని కుటుంబ సభ్యులు పరారయ్యారు. బాధిత మహిళా ఫిర్యాదు చేయడంతో మోషిన్ పై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా, మట్కా చీటీలు స్వాధీనం

నగరంలోని జమ్మి చెట్టుకి సమీపంలో ఇద్దరు వ్యక్తులు సారాయి విక్రయిస్తుండగా వన్ టౌన్ పోలీసులు దాడి చేసి వారి నుంచి పది సారా బాటిళ్లు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. చిత్తారి వీధి చెందిన సయ్యద్ హబీబుల్లా, నాగప్ప వీధికి చెందిన శ్రీ బాలస్వామిలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో పీవీ రమణ

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ(సెట్కూరు) అధికారి పీవీ రమణ చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 23, నంద్యాల జిల్లాలో 17 ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్‌పై అవగాహన కల్పించామన్నరు. పదో తరగతి తర్వాత ఏ కోర్సు తీసుకోవాలి, ఏ కోర్సు తీసుకుంటే ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయనే విషయాల గురించి వారికి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ముందుకొస్తే ప్రైవేటు పాఠశాలల్లో కూడా శిక్షణ అందిస్తామన్నారు. వివరాలకు కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సెట్కూరు కార్యాలయంలో లేదంటే సెట్కూరు సీఈవో పీవీ రమణ 9849909070, మేనేజర్ జి.సత్యనారాయణ 8688361250 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీకృష్ణదేవరాయల్ సర్కిల్‌లోఒకటో తేదీనే జీతాలు, రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆ సంఘం కర్నూలు జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్.ఇస్మాయిల్ అధ్యక్షతన ఒక రోజు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకులకు సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో విద్యా బోధనకు ఆటంకం కల్గిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌యూపీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రుడు మాట్లాడారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లకు 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని ఏపీజీఈఏ జిల్లా శాఖ అధ్యక్షుడు బంగి శ్రీధర్ కోరారు. శనివారం సి.క్యాంపులోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఫంక్షన్ హాల్‌లో జీతాలు-బకాయిలు, చెల్లింపులు- చట్టబద్ధత అనే అంశంపై ఏపీజీఈఏ జిల్లా శాఖ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది.



ప్రయాణం సాఫీగా సాగాలని.. కారుకు పూజలు చేస్తున్న భక్తులు



వడివడిగా శ్రీగిరి వైపు: ఎండను సైతం లెక్క చేయక నడక సాగిస్తున్న శివ భక్తులు



మేము సైతం: పాదయాత్రలో మహిళలు, చిన్నారులు

దారులన్నీ శ్రీశైలం వైపే...

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేడుకలను తిలకించేందుకు, మల్లన్న ఆశీస్సులు పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి వెళ్తున్నారు. కొందరు కాలినడకన, మరికొందరు వాహనాల్లో శ్రీగిరి క్షేత్రాన్ని చేరుకుంటున్నారు. నిష్టగా 41 రోజుల పాటు దీక్ష నిర్వహించి, ఇరుముడిని సమర్పించేందుకు శివమాలధారులు ముక్కంటి సన్నిధికి వెళ్తున్నారు. పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ సాగుతున్న వీరి పాదయాత్ర ప్రతి ఒక్కరిలో భక్తిభావాన్ని నింపుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పుణ్య స్నానం: గార్గేయపురం చెరువులో స్నానాలు ఆచరిస్తూ..



భక్తిభావం: జెండాతో వెళ్తున్న వృద్ధుడు





నమో..నీలకంఠా! వాహనాల్లో శ్రీశైలం వెళ్తున్న భక్తులు



సడలని సంకల్పం: మల్లన్నను దర్శించుకునేందుకు కాలినడకన వెళ్తున్న దివ్యాంగుడు



ధ్యాన ముద్ర: పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ..

సమర్పణ దినోత్సవ్‌గా జరుపుకోవడం సంతోషం

కర్నూలు(సెంట్రల్): పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్థంతిని సమర్పణ దినోత్సవ్‌గా జరుపుకోవడం సంతోషకరమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్థంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒక్కరైన దీన్‌దయాల్ ఉపాధ్యాయను హత్య చేసి రైలు పట్టాలపై పడేశారని, ఇంతవరకు ఆయనను ఎవరూ చంపారో తెలియలేదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామస్వామి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్, ఓబీసీ మోర్చా కార్యదర్శిడాక్టర పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని మహిళ మూత్రాశయంలో పెన్సిల్

కర్నూలు(హాస్పిటల్): మతిస్థిమితం లేని మహిళ మూత్రాశయంలో ఇరుక్కున్న పెన్సిల్‌ను కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు చాకచక్యంగా తొలగించారు. వివరాలను శనివారం యురాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ వివరించారు. 32 సంవత్సరాల మతిస్థిమితం లేని మహిళ ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చిందని, ఆమెకు పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పనిచేయని స్థితిలో ఉండి, కడుపులో చీము పేరుకు పోయిందన్నారు. సిటిస్కాన్ చేసిన తర్వాత ఆమె మూత్రాశయంలో పదునైన పెన్సిల్ చేరి మూత్రాశయానికి రంధ్రాలు పడి కడుపులో మూత్రం లీక్ అవుతున్నట్లు నిర్ధారించామన్నారు. వెంటనే అత్యవసర శస్త్ర చికిత్స చేసి పెన్సిల్ తొలగించామని.. మూత్రాశయంలో రంధ్రాలను సవరించి ప్రాణాలను కాపాడామన్నారు. శస్త్రచికిత్సలో తనతో పాటు అనెస్తెటిస్ట్ డాక్టర్ బాలప్రవీణ్, డాక్టర్ రేష్మ పాల్గొన్నట్లు తెలిపారు.



తొలగించిన పెన్సిల్

లోక్ అదాలత్ ఎఫెక్ట్..పన్ను చెల్లింపు షురూ!

- పన్ను చెల్లించిన బకాయిదారులు
- మొదటి రోజు రూ. 12.85 లక్షలు వసూలు

కర్నూలు (టౌన్): 2022-2023 ఆర్థిక సంవత్సరం మరో నెల రోజుల వ్యవధిలో ముగియనుంది. ఇప్పటికే మొండి బకాయిదారులకు ఎన్నిసార్లు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసిన స్పందించకపోవడంతో నగరపాలక రెవెన్యూ అధికారులు లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు మొండి బకాయిదారులందరికీ నోటీసులు జారీ చేసింది. పన్ను బకాయిలు చెల్లించాలని, లేకుంటే జప్తు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 3,157 మంది మొండి బకాయిదారులకు నోటీసులు రావడంతో మొదటి రోజు కొంత మంది స్పందించారు. వీరందరి కోసం శనివారం నగరపాలక కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేశారు. పేటలు, వార్డుల వారీగా పన్నులు చెల్లించే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే ఆస్తిపన్ను బకాయిలు రూ.10.80 లక్షలు, నీటి పన్ను బకాయిలు రూ.2.05 లక్షలు వసూలు అయినట్లు రెవెన్యూ అధికారులు జునీద్, మన్సూర్ వెల్లడించారు. నోటీసులు వచ్చిన వారందరు తప్పనిసరిగా పన్ను బకాయిలు చెల్లించాలని లేకుంటే కోర్టు ఆదేశాలు అమలు అవుతాయని వెల్లడించారు.

‘ముసుగేశారు’

కర్నూలు (టౌన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. నగరంలోని కలెక్టరేట్ సర్కిల్, రాజ్‌విహార్ సర్కిల్, వైఎస్ఆర్ సర్కిళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది విగ్రహాలు కనిపించకుండా కప్పేశారు.అదేవిధంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు పాతబస్తీ, ఉస్మానియా కళాశాల, కలెక్టరేట్, ఐదు రోడ్ల కూడలి, కొత్త బస్టాండ్ ప్రాంతాలలో వెలసిన అన్ని పార్టీలకు చెందిన ఫ్లెక్సీ లను తొలగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మే రకు నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న నేతల విగ్రహాలకు ముసుగులు వేసినట్లు అసిస్టెంట్ సీటీ ప్లానర్ హయ్యత్ వెల్లడించారు.



విగ్రహానికి ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

విజయలక్ష్యంతో ముందుకు వెళ్లండి

కర్నూలు(రాజ్‌విహార్): ఉద్యోగం పొందాలని విజయ లక్ష్యంతో ముందుకు వెళ్లాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. శనివారం తన కార్యాలయంలో బుట్టా ఫౌండేషన్ ద్వారా పోలీసు ఉద్యోగానికి శిక్షణ పొంది అర్హత సాధించిన అభ్యర్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, బుట్టా ఫౌండేషన్ ప్రతినిధులు, ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సెక్రటరీ బదిలీ?

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందును అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మార్కెట్ కమిటీ సెక్రటరీగా 6 నెలల క్రితమే ఇక్కడికి బదిలీపై వచ్చారు.

‘ఆ నిబంధన తొలగించాలి’

కర్నూలు(సెంట్రల్): వైఎస్ఆర్ కల్యాణమస్తు-షాదీతోఫా పథకంలో పదో తరగతి పాసు అయి ఉండాలనే నిబంధనను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగేళ్ల తరువాత పథకాన్ని ప్రారంభించడం సంతోషమని, అయితే ఆ నిబంధనతో అనేక మంది అర్హతను కోల్పోతున్నారన్నారు.

14న సాగునీటి ప్రాజెక్టుల సందర్శన

కర్నూలు(సెంట్రల్): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం ఫిబ్రవరి 14వ తేదీన జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను సందర్శించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ బృందం 13వ తేదీన తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలించి 14న కర్నూలు జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ఇక్కడ వేదవతి, గుండ్రేవుల, మల్యాల ఎత్తిపోతలు, పోతిరెడ్డిపాడు, బనకచర్ల, సిద్దేశ్వరం అలుగు, వెలుగోడు రిజర్వాయర్లను పరిశీలించనున్నట్లు ఆయన వివరించారు.

నివాళి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వాల్మీకి/ బోయ కార్పొరేషన్ చైర్మన్ డా.మధుసూదన్ మాతృమూర్తి ఏటీ మద్దమ్మ ఈ నెల 10వ తేదీ రాత్రి కర్నూలులోని స్వగృహంలో మృతి చెందారు. శనివారం ఉదయం వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పలు రైళ్లు రద్దు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో (పట్టాల పనులు) మచిలీపట్నం-కర్నూలు సిటీ, గుంటూరు-కాచిగూడ, గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లను నెలాఖరు వరకు రద్దు చేసినట్లు వెల్లడించారు.

రేపు వాము క్రయవిక్రయాలు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వాము క్రయవిక్రయాలు చేపట్టడం లేదని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐజ ప్రాంతంలో జరిగే జాతరకు ఒంటెద్దు బండ్ల యజమానులు వెళ్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి యథాతథంగా వాము క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు ‘విద్యావంతుల సదస్సు’

కర్నూలు(సెంట్రల్): బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యావంతుల సదస్సు..కేంద్ర బడ్జెట్‌పై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహవర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మౌర్య ఇన్ హోటల్‌లోని విభు ఫంక్షన్ హాలులో జరిగే ఈ సదస్సుకు కేంద్రమంత్రి దేవుసిన్హా చౌహాన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు.

ఘంటసాల జీవితంపై నాటక ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): శతాబ్ది గాయకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఆయన జీవిత ఇతివృత్తంపై రచించిన కథ ఆధారిత ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కన్వీనర్ చంద్రకంటిమద్దయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉచిత మెడికల్ క్యాంపు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 22వ తేదీన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత మెడికల్‌క్యాంపును నిర్వహించనున్నట్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి నాయకుడు సుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ క్యాంపులోని మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించే ఈ మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైళ్లపై రాళ్లు విసిరితే కఠిన చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): రైళ్లపై రాళ్లు విసరడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్‌పీఎఫ్ కర్నూలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సత్యనారాయణ హెచ్చరించారు. త్వరలో కాచిగూడ-బెంగళూరు మధ్య వందే భారత్ రైలు నడపనున్న నేపథ్యంలో ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం కర్నూలులోని కేసీ కెనాల్, కర్నూలు సిటీ స్టేషన్, కోట్ల హాల్ట్, దూపాడు రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవలి కాలంలో వందే భారత్ రైలుపై వివిధ ప్రాంతాల్లో రాళ్లు విసిరిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వందే భారత్ రైలుకు ఏదైనా నష్టం కలిగిస్తే రైల్వే చట్టం ప్రకారం కఠిన కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, కల్పన, స్వామి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

యునాని వైద్యం ప్రతి ఒక్కరూ తీసుకోవచ్చు

కర్నూలు(హాస్పిటల్): యునాని వైద్యం కేవలం ఒక వర్గానికి చెందినదిగా చాలా మందిలో భావన ఉందని, ఇది ప్రతి ఒక్కరూ నిరభ్యంతరంగా తీసుకోవచ్చని కమిషనర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎం.సరస్వతి చెప్పారు. జాతీయ యునాని దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ యునాని వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు నగరంలో యునాని వైద్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ఉచిత యునాని వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై సైంటిఫిక్ సెషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సరస్వతి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, కేవీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర శాంతి, ఏపీ యునాని వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షాకిర్ అహ్మద్, జనరల్ సెక్రటరీ డాక్టర్ షఫ్రాజ్ నవాజ్, జాయింట్ సెక్రటరీలు డాక్టర్ శాంతిశిరిల్, డాక్టర్ నవీన్ కుమార్, సభ్యులు డాక్టర్ కరీమున్నీసా, డాక్టర్ ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

స్పందన రద్దు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు నగరపాలక కమిషర్ భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు చెప్పారు.

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయం

- వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా వీఆర్‌పీఎస్ ఉద్యమాలను చేస్తూనే ఉంటుందని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని 2007 నుంచి వీఆర్‌పీఎస్ ప్రజాస్వామ్య పద్ధతిలో అనేక రూపాల్లో ఉద్యమాలు కొనసాగించిందన్నారు. 2015లో కుప్పం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చేపట్టిన అనేక ఉద్యమాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం అప్పట్లో అసెంబ్లీ తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. అయితే తీర్మాణంలో చోటు చేసుకున్న తప్పులను సరిచేసి తిరిగి పంపాలని కేంద్రం కోరినా, అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాతవాటిని తిరగదోడకుండా తాజాగా వాల్మీకుల స్థితిగతులపై నివేదికలు రూపొందించేందుకు రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిషన్ రెండు, మూడు నెలలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వాల్మీకుల స్థితిగతులపై నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేయనుందన్నారు. ఈ నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై తీర్మాణం చేసి కేంద్రానికి పంపుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.



ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కేంద్రంతో అమీతుమీ ...

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపిన వెంటనే వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్యమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు నుంచి పార్లమెంట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఢిల్లీలోనే ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా సాగుతున్న ఈ ఉద్యమాల్లో రాజకీయాలకు అతీతంగా వాల్మీకులందరు కలిసి రావాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ల మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు మొలగవెల్లి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు గోవిందప్ప, మాజీ జెడ్పీటీసీ మాలపల్లి లక్ష్మయ్య, ఆలూరు సీనియర్ నాయకులు ఆంజనేయులు, శివ, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.